క్లుప్తంగా

గ్రామాల్లో ఘనంగా దేశమ్మవారి జాతర

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో దేశమ్మ వారి జాతర ఆదివారం ఘనంగా జరిగింది. ఏటా ఖరీఫ్‌సీజన్‌లో రైతులు నిర్వహించే తొలి జాతరలో భాగంగా దమ్ముల్లో చల్లగా ఉబాలు నిర్వహించడానికి అమ్మవార్లు దీవెనలు ఇవ్వాలని కోరుతూ చల్లదనం చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ మేరకు ఆదివారం కృష్ణారాయపురం, పెదభోగిలి పంచాయతీ కుమ్మరి వీధి, లక్ష్మీపురం, కాశీపేట గ్రామాల్లో దేశమ్మతల్లి చల్లదనం చేయడానికి పూజలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు అమ్మవారి గుడి వరకూ పూజా ద్రవ్యాలతో పయనమై ప్రసాదాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రంజిత్‌కుమార్


పాలక రంజిత్ కుమార్

పార్వతీపురం రూరల్: జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తాను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పాలక రంజిత్‌కుమార్ ఆదివారంఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఈనెల 12, 13 తేదీల్లో కడప జిల్లా కేంద్రంలో జన విజ్ఞాన వేదిక 18వ రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక నిర్వహించినట్లు ఈ ఎన్నికలో తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రంజిత్‌కుమార్ మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాలో జన విజ్ఞాన వేదిక కార్యక్రమాలు విస్తృతం చేస్తామన్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలి


అధ్వానంగా ఉన్న చినబొండపల్లి నుంచి చొక్కాపువానివలస వెళ్లే రహదారి

పార్వతీపురం రూరల్: మండలంలోని చొక్కాపువానివలస గ్రామానికి వెళ్లేందుకు ఉన్న రహదారిని మరమ్మతులు చేసి వాహన దారులకు సురక్షితమైన రహదారిని అందించాలని గ్రామస్తులు, వాహనచోదకులు కోరుతున్నారు. చిన బొండపల్లి నుంచి చొక్కాపువానివలసకు వెళ్లేందుకు ఉన్న దారి మలుపుల వద్ద అలాగే అక్కడక్కడ రోడ్డు అధ్వానంగా మారి బురదతో నిండి ఉండడంతో అవస్థలు పడాల్సి వస్తోందని, తక్షణమే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థిని ఎంపిక


తనూజ

సీతానగరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరంలో టెన్త్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని గుణుపూరు తనూజ శ్రీకాకుళంలోని ట్రిపుల్‌ఐటీలో ప్రవేశానికి సెకెండ్ లిస్టులో అర్హత పొందడంతో హెచ్‌ఎం ఇల్లా ప్రసన్నలక్ష్మి అభినందించారు. ట్రిపుల్‌ఐటీలో సీటు సంపాదించిన విద్యార్థిని తనూజను పాఠశాల కమిటీ చైర్మన్ పి.శ్రీదేవి, ఉపాధ్యాయులు బి.మాధవి, డి. రామారావు, కె.శ్రీరాములు, పి.రామకృష్ణ, జీవీ నాగరాజు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

సూర్యపీఠంలో సౌరారుణ పారాయణ సహిత హోమం


సూర్యపీఠంలో స్వామి వారికి చేస్తున్న ప్రత్యేక పూజలు

పార్వతీపురంటౌన్: పట్టణ శివారులో గల సూర్యపీఠంలో సౌరారుణ పారాయణ సహిత హోమాన్ని వేమకోటి నరహరి శాస్త్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యనారాయణునికి ప్రీతికరమైన ఆదివారం స్వామి వారికి భానువార ప్రయుక్త సౌర దీక్షలో సూర్య నమస్కారములు, రుద్రమన్యు సూక్త మంత్రహవనం, సుదర్శన హోమం, ఆదిత్య పంచాయతన క్షీరాభిషేకాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో వేమకోటి వివేకానంద్, శివ శర్మ, బద్రి శర్మ, డి.ఉమాశర్మ, టీఆర్ కృష్ణ శర్మ, కేశవశర్మ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని బీజేపురానికి చెందిన ఎల్‌ఐసీ ఏజెంట్ కరకవలస రమణమూర్తి ఈ నెల 8న రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఈ మేరకు ఆయన తోటి ఎల్ఐసీ ఏజెంట్లు జి.జగన్నాథంనాయుడు, ఎం.నారాయణస్వామి, రామకృష్ణ, ఉమామహేశ్వరరావు, వరప్రసాద్, రమేష్‌లు బాధిత కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. అనంతరం రూ.10 వేలను ఆర్థికసాయంగా అందజేశారు.

సొంత డబ్బా.. పరనిందే కూటమి పాలన


సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

- అమలు కాని మంత్రి సంధ్యారాణి హామీలు
- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు:

సొంత డబ్బా, పరనిందలతోనే కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తిచేయడం, ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో ప్రజల్లో ఈ కూటమి ప్రభుత్వంపై ఏడాదిలోనే తీవ్ర వ్యతిరేకత పెరిగిందని వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. వైఎస్సార్సీపీ మక్కువ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు ఆధ్వర్యంలో మక్కువ మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన మక్కువ మండల వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ, సూపర్‌సిక్స్ పథకాలతో పాటు అనేక హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తయినా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. నిరుద్యోగ భృతి, అన్నదాత సుఖీభవ తదితర హామీలను ఈ ఏడాది అమలు చేయకపోవడం వల్ల లబ్ధిదారులకు ఈ ఏడాది రావాల్సిన డబ్బులు రాలేదని, ఇది వారిని మోసం చేయడం, వంచించడం కాదా? అని మండిపడ్డారు. బాబు ష్యూరిటీ–మోసాలకు గ్యారంటీ అంటూ కూటమి ప్రభుత్వం ప్రజలను ఎలా మోసం చేస్తోందో కూలంకుషంగా వివరించారు. వాటిని క్షేత్రస్థాయిలో ప్రజల వద్దకు వెళ్లి తెలపాలని, క్యూఆర్ కోడ్ గురించి తెలిపారు. అందరూ సంయమనంతో ఉండాలని, ఎక్కడా విమర్శలు చేయవద్దని, ఈ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రజలకు ఈ పాంప్లెట్‌లు, క్యూ ఆర్ కోడ్ ద్వారా స్కాన్ చేయించి గుర్తుచేయాలని సూచించారు. కూటమి నేతలు చేయించిన సర్వేల్లోనే ప్రస్తుతం రాష్ట్రంలో 52శాతం ప్రజలు కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకంగా ఉన్నారని పలు సర్వేలు చెబుతున్నాయని పేర్కొన్నారు.

ఉద్యోగుల తొలగింపు, వేధింపుల పర్వం

కూటమి ప్రభుత్వంలో క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగుల నుంచి పెద్ద స్థాయి వరకు ఉద్యోగులను తొలగిస్తూ,సుదూర ప్రాంతాలకు బదిలీచేస్తూ అనేక విధాలుగా వేధిస్తున్నారని పేర్కొన్నారు. పాచిపెంట మండలంలో ఓ దళిత ఎంఈఓను సస్పెండ్ చేయించారని, పంచాయతీ కార్యదర్శులను, ఫీల్డ్ అసిస్టెంట్‌లను సస్పెండ్ చేయించారని, మక్కువలో హెచ్ఎంలకు మెమోలు ఈ కూటమి పాలనలో ఇస్తున్నారని తెలిపారు.

అమలుకాని మంత్రి హామీలు

ఎన్నికల ముందు, అధికారంలోకి వచ్చిన తరువాత మంత్రి సంధ్యారాణి ఇచ్చిన హామీలు అమలు కాలేదని రాజన్నదొర విమర్శించారు. గిరిజన సంక్షేమశాఖ మంత్రిగా ఏఎన్ఎంల నియామకంపై తొలిసంతకం చేసిన సంధ్యారాణి ఆ హామీని అమలు చేశారా? అని ప్రశ్నించారు. జీఓ 3 పునరుద్ధరణ చేస్తామని హామీ ఇచ్చి మాట తప్పారన్నారు. జీగిరాం జూట్ ఫ్యాక్టరీని తెరవాలని గతంలో అక్కడ కార్మికులు ధర్నాచేస్తుంటే అక్కడికి వెళ్లిన సంధ్యారాణి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు, మూడు నెలల్లోనే ఫ్యాక్టరీ తెరిపిస్తామని హామీ ఇచ్చారని, మరి ఏడాదైనా ఎందుకు తెరిపించలేదని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వంలో గ్రామసభ,సర్పంచ్‌ల తీర్మానాలు లేకుండా పనులు చేపట్టి సర్పంచ్‌లు హక్కులను కాలరాస్తున్నారని తెలిపారు.తమ హక్కులకు భంగం కలగడం వలనే పలువురు సర్పంచ్‌లు న్యాయస్థానాలను ఆశ్రయించారన్నారు.సర్పంచ్‌ల వాదనల్లో వాస్తవం ఉండబట్టే కోర్టులు స్టే ఇచ్చాయని పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తే రాజు.. మంత్రి

ఇప్పటికే కూటమి పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పెరిగిందని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అఖండ మెజారిటీతో రాష్ట్రంలో కొలువుదీరడం ఖాయమన్నారు. అప్పుడు ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్తనే రాజు..మంత్రి అని జగన్‌మోహన్‌రెడ్డి చెప్పమన్నారని తెలిపారు. పార్టీ శ్రేణులంతా ఐక్యంగా ఉండి, జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయబావుటాలను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జెడీపీటీసీ మావుడి శ్రీనివాసనాయుడు మాట్లాడుతూ, ప్రతిపక్షంలో ఉన్న మనం ప్రజల పక్షాన నిలబడాలని కావున ప్రతి ఇంటికి వెళ్లి ఈ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రజలకు తెలియచేయాలన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు, పార్టీ యకులు సంజీవనాయుడు, సుబ్బరాజు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పరిమితంగా ప్రయాణికులు

- పార్వతీపురం రూరల్ ఎస్సై బి.సంతోషి


ఆటోడ్రైవర్‌తో మాట్లాడుతున్న పార్వతీపురం రూరల్ ఎస్సై బి.సంతోషి

పార్వతీపురం రూరల్: ఆటోలో ప్రయాణికులను తీసుకుని వెళ్లేటప్పుడు ప్రయాణికుల సంఖ్య పరిమితికి మించి ఉండరాదని పార్వతీపురం రూరల్ ఎస్సై బి.సంతోషికుమారి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని పలు కూడళ్లలో సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు వాహన దారులు తమ వంతు బాధ్యతగా నిబంధనలు కచ్చితంగా పాటించాలని కోరారు. అలాగే అక్రమ రవాణాపై ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రత్యేకంగా దృష్టి సారించామని తెలిపారు. ఈ మేరకు ఎప్పటికప్పుడు వాహనాల తనిఖీ చేపట్టనున్నామన్నారు. వాహనదారులతో మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపరాదని, రోడ్లపై వెళ్లేటప్పుడు గ్రామాలు సమీపిస్తున్న తరుణంలో అతివేగంతో వెళ్ల కూడదన్నారు. నిబంధనలు పాటించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు.

డాక్టర్ సీహెచ్ దీనకుమార్‌కు ఘనంగా ఆత్మీయ వీడ్కోలు


డాక్టర్ సీహెచ్ దీనకుమార్‌ను సన్మానిస్తున్న పెద్దలు, పాల ఉత్పత్తిదారులు శ్రేయోభిలాషులు

సీతానగరం: పశు సంవర్థక శాఖ సీతానగరం సబ్‌డివిజన్ ఆస్పత్రిలో సహాయ సంచాలకుడిగా పనిచేసిన డాక్టర్ చింతాడ దీనకుమార్ పార్వతీపురం బదిలీపై వెళ్లగా ఆదివారం ఆయనకు ఘనంగా ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని గ్రామ పెద్దలు, రైతులు, ఆత్మీయులు కలిసి నిర్వహించారు. స్థానిక పశు వైద్యశాఖ ఎ.డి డాక్టర్ బొత్స శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ డాక్టర్ దీనకుమార్ కుమార్ సీతానగరం మండలంలో 20ఏళ్లుగా డాక్టర్ నుంచి సహాయసంచాలకుడి వరకూ అందించిన సేవలను గుర్తు చేశారు. సన్మాన గ్రహీత డాక్టర్ దీనకుమార్ మాట్లాడుతూ తాను సామాన్య కుటుంబం నుంచి వచ్చానని అందరి కష్టాలు తెలుసుకుని ఏదోవిధంగా సేవలందించాలన్న సంకల్పంతో వైద్య వృత్తిలో చేరానని అన్నారు. కార్యక్రమంలో బగ్గందొరవలస పశు వైద్యుడు డాక్టర్ ఎస్.రామారావు, సీతానగరం రైతు పెద్దలు, పాడి రైతులు, జీజే కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, పెన్షనర్ల సంఘం ప్రెసిడెంట్ ఆర్‌వీఎస్ రాఘవరావు, ఈర్ల సూర్యనారాయణ, పాపారావు, ఎం.సత్యనారాయణ, ఎన్ చిన్నారావు, పశు వైద్య సిబ్బంది ఎల్ఎస్ఏ శ్రీనివాసరావు, గోపాలమిత్ర వెంకటరమణ, గాయత్రి, గణేష్ పాల్గొన్నారు.

'సమావేశాన్ని విజయవంతం చేయండి'


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

భామిని:

మండలంలోని అనంతగిరి తోటలో సోమవారం నిర్వహించనున్న వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశానికి కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల నాయకులు కోరారు. ఈ మేరకు పార్టీ మండల అధ్యక్షుడు బోదెపు శ్రీనివాసరావు, యువజన అధ్యక్షుడు గెల్లంకి రమేష్, ఎంపీటీసీ సభ్యుడు కొత్తకోట చంద్రశేఖర్ మండల కేంద్రంలో ఆదివారం సమావేశమై ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అరకు ఎంపీ డాక్టర్ తనూజారాణి, ఎమ్మెల్సీ విక్రాంత్‌బాబు, నియోజకవర్గ సమన్వయకర్త వి.కళావతి ఆధ్వర్యంలో నిర్వహించనున్న సమావేశంలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' అంశంపై చర్చిస్తారని తెలిపారు. ప్రతి ఒక్కరూ హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దామోదర కంతయ్య, జామి ప్రభాకర్, కాగితాపల్లి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బీసీ మహిళపై దాడి అమానుషం


నిమ్మక గోపాల్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ వింగ్ సెక్రటరీ

గుమ్మలక్ష్మీపురం: కృష్ణా జిల్లా, గుడివాడలో జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై టీడీపీ గూండాలు దాడికి పాల్పడడం అమానుషమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ వింగ్ సెక్రటరీ నిమ్మక గోపాల్ ఖండించారు. ఇదే విషయమై ఆయన స్థానిక విలేకరులతో ఆదివారం మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ ప్రశ్నించే గొంతుకలపై దాడులకు పాల్పడుతోందని, రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాసం చేస్తోందని విమర్శించారు. సాక్షాత్తు జిల్లా ప్రథమ పౌరురాలికే ఇలా రక్షణ లేకుండా పోయిందంటే సామాన్య ప్రజల పరిస్థితి ఏంటని నిలదీశారు. మహిళల భద్రతపై చిత్తశుద్ధి ఉంటే తక్షణమే దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

- మూణ్నాళ్ల ముచ్చటే..


బిల్లుమడ- నులకజోడు రోడ్డులో గోతులు

భామిని: కూటమి ప్రభుత్వం హయాంలో వేసిన రోడ్లన్నీ మూణ్నాళ్ల ముచ్చటగా మిగిలాయి. మండలంలోని బిల్లుమడ – నులకజోడు మధ్య తారురోడ్డు వేశారు. దీంతో తమకు రహదారి కష్టాలు తీరాయని ప్రజలు ఎంతో సంతోషించారు. నెలల వ్యవధిలోనే రోడ్డు పాడవ్వడంతో వారి ఆనందం ఆవిరైంది. ఏప్రిల్ చివరిలో వేసి తారు రోడ్డు మే నెలలో ఊడిపోయింది. దీంతో విమర్శలు రావడంతో తారు రోడ్డు పీకించి, మెటల్ మిక్చర్‌తో కప్పారు. ప్రస్తుతం ఆ మెటల్ కూడా ఊడిపోవడవంతో గోతులేర్పడ్డాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గోతుల్లో నీరు చేరి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఆషాఢం గోరింటాకు సంబరం


వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో గోరింటాకు సంబరం

పార్వతీపురంటౌన్: పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం ఆషాఢ మాస గోరింటాకు సంబరం నిర్వహించారు. మహిళలంతా గోరింటాకు, కదంబరం, బంతి, చామంతి పూలతో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని సుందరంగా అలంకరించారు. అనంతరం రుబ్బురోలుకు ప్రత్యేక పూజలు నిర్వహించి మహిళల చేతులకు గోరింట పెట్టుకున్నారు. ఒకరికి ఒకరు ఆషాఢ మాస శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఇలా చేస్తే ఇంటిల్లిపాది సకల సౌభాగ్యాలతో సంతోషంగా ఉంటారని మహిళల నమ్మకం.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

కొమరాడ: మహిళలకు జీవనోపాధికి ఉపయోగపడేలా అందిస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు జి.రేణుక ఆదివారం కోరారు. మండలంలోని శివిని గ్రామంలో ఓ ప్రైవేటు పాఠశాలలో రాయల్ అకాడమీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్ శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. టైలరింగ్‌తో పాటు ఎంబ్రాయిడింగ్, బ్యుటీషియన్ కోర్సుల్లో కూడా శిక్షణ అందజేస్తున్నామని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకుడు కళింగి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దాతలు ముందుకు రావాలి

పాలకొండ రూరల్: పట్టణంలోని గేదెలవారి వీధికి చెందిన కుప్పిలి కృష్ణారావు ఇటీవల సింహాచలం గిరి ప్రదక్షిణ అనంతరం స్వగ్రామానికి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈయన ప్రస్తుతం కోమాలో ఉన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఈయనకు మెరుగైన చికిత్స అందించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో స్థానిక శిష్టకరణాల సంక్షేమ సంఘ సభ్యులు ఆదివారం రూ. 36 వేలను క్షతగాత్రుడి తల్లి అమ్ములమ్మకు అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ ప్రతినిధులు కాంతారావు, తదితరులు మాట్లాడుతూ.. దాతలు ముందుకు వచ్చి క్షతగాత్రునికి ఆర్థిక సాయం అందించాలని కోరారు.

పచ్చిరొట్టతో భూసారం


బర్లిలో పచ్చిరొట్ట ఎరువు పంటకోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న డీపీఎం శ్రావణ్‌కుమార్

బలిజిపేట: పచ్చిరొట్ట ఎరువులను వేసుకోవడంతో భూసారం పెరుగుతుందని ఏపీసీఎస్ఎఫ్ డీపీఎం శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని బర్లి గ్రామంలో ప్రీ మాన్సూన్ డ్రై షోయింగ్(పీఎండీఎస్)లో బయోమాస్ పంటకోత ప్రయోగాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 5 5 విస్తీర్ణంలో 45.230 కిలోల బయోమాస్ వచ్చిందని తెలిపారు. ఈ లెక్కన 35 రోజుల్లో ఎకరాకు 7 మెట్రిక్ టన్నుల పచ్చిరొట్ట ఎరువు అందుతుందన్నారు. అందువల్ల రైతులు పీఎండీఎస్, పచ్చిరొట్ట ఎరువులు వేసుకోవడం ద్వారా భూసారాన్ని పెంచుకోవచ్చని చెప్పారు. సేంద్రియ కర్బన్ శాతాన్ని పెంచుకోవచ్చని సూచించారు. పీఎండీఎస్ చేలో పెరిగిన గడ్డిజాతి, పప్పు జాతి మొక్కలను పశువుల మేతగా వినియోగించుకోవచ్చని దీనిద్వారా నాణ్యమైన పాల ఉత్పత్తిని పొందవచ్చని వివరించారు. సుభద్రలో ద్రవ జీవామృతం తయారీ కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జ్ లక్ష్మి, తిరుపతిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఖరీఫ్ పనుల్లో రైతులు


బూర్జలో వరినాట్లు వేస్తున్న మహిళలు


లక్ష్మీపురంలో ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న రైతులు

సీతానగరం: ఇటీవల కురుస్తున్న అరకొర వర్షాలకు దమ్ము చేయడం మడులను చదును చేయడం, వరినాట్లు వేసే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ఖరీఫ్ వరి సాగు చేయాల్సిన భూముల్లో ఖనిజ లవణాలు, సేంద్రియ ఎరువు ఉత్పత్తికి రైతులు వేసిన పచ్చిరొట్ట పంటకు ట్రాక్టర్‌తో దమ్ములు చేయడం, పంటదమ్ము చేసిన అనంతరం నొల్ల చెక్కతో మట్టిని చదును చేస్తున్నారు. దమ్ము పనులు పూర్తి చేసుకున్న మడులలో మహిళలు వరినాట్లు వేయడంలో నిమగ్నమయ్యారు.

సీతానగరం మండలంలో ఇప్పటివరకు 30 శాతం భూముల్లో దమ్ము పనులు పూర్తికావచ్చాయని రైతులు అంటున్నారు. ఖరీఫ్ వరినాట్లు వేయడంతో ఎరువులు, క్రిమిసంహారక మందులు, తెగుళ్ల నివారణ మందులు రాయితీపై ప్రభుత్వం సమకూర్చాలని రైతులు కోరుతున్నారు.

మెరిట్ అభ్యర్థులకే గెస్ట్ అధ్యాపకుల అవకాశం


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పార్వతీపురంటౌన్: జిల్లాలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో మెరిట్ అభ్యర్థులే గెస్ట్ అధ్యాపకులు కావాలని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా చైర్మన్ వంగల దాలినాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం అయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని పలు కళాశాలల్లో గెస్ట్ ఫ్యాకల్టీ అధ్యాపకుల నియామకానికి అధికారులు ప్రకటన జారీ చేయడం సంతోషకరమన్నారు. అయితే గెస్ట్ ఫ్యాకల్టీ ఎంపికలు ఎమ్మెల్యే, మంత్రుల సిఫార్సు లేఖలతో జరుగుతాయన్న ప్రచారంతో పలువురు అభ్యర్థులు సిఫార్సుల కోసం ఎగబడుతున్న విషయం తమ దష్టికి వచ్చిందన్నారు. ఇప్పటికే కొంతమంది అభ్యర్థులు ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు ఎమ్మెల్యేలు, మంత్రుల నుంచి ఫోన్ కాల్స్ చేయించడం, సిఫార్సు లేఖలు అందజేయడం వంటివి చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. గెస్ట్ అధ్యాపకుల నియామకంలో మెరిట్ ఉన్న అభ్యర్థులనే ఎంపిక చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు కోలా కిరణ్ కుమార్, మండల అధ్యక్షుడు తీళ్ల గౌరీ శంకరరావు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు


వాహన తనిఖీలు చేస్తున్న ట్రైనీ ఎస్ఐలు సాయికుమార్, శ్రీప్రియా

జియ్యమ్మవలస రూరల్: మండల పరిధిలోని బీజేపురం కూడలిలో ట్రైనీ ఎస్ఐలు సాయికుమార్, శ్రీప్రియాలు సిబ్బందితో కలిసి ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. వాహనదారుల లైసెన్స్, వాహన ధ్రువపత్రాలు, పెండింగ్ చలాన్లు పరిశీలించి, పలు సూచనలు చేశారు. వాహనంతో బయటకు వచ్చేటప్పుడు వాహన ధ్రువపత్రాలు సహా లైసెన్స్ తీసుకురావడం తప్పనిసరి అని, అలాగే ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు

వీరఘట్టం: మండల ప్రజల ఇలవేల్పు కోటదుర్గ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గోత్రనామాలతో పూజలు జరిపించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె

పాలకొండ: నగర పంచాయతీలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ మున్సిపల్ కార్మికులు ఆదివారం నుంచి సమ్మెకు దిగారు. తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ నగర పంచాయతీ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు మాట్లాడుతూ.. గత సమ్మె కాలంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. పది నెలలుగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నా ప్రభుత్వం నుంచి స్పందన రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయని కారణంగా సమ్మె చేపట్టాల్సి వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో వై. హరిబాబు, టి. వెంకటరావు, పి. సాయి, పి. సతీష్, పి. శ్రీను, పి. రమేష్, ఐ. రాజు, కె. నర్సింగరావు, సీహెచ్ రాము, సంజీవి, వేణు, తదితరులు శిబిరంలో పాల్గొన్నారు.